ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024



'వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తాం. నెల జీతం పది వేలకు పెంచుతాం' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన వలంటీర్లలో భయానికి బ్రేకులు వేసింది. వైసీపీలో కలవరం సృష్టించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ ఆశలకు రాజీనామాలకు బ్రేక్

చంద్రబాబు పదివేల వేతనం ప్రకటనతో డైలమాలో వలంటీర్లు

గత రెండేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం వలంటీర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంది. పేరుకు ప్రభుత్వ గౌరవ ఉద్యోగమే కానీ ఎక్కడికక్కడ స్థానిక వైసీపీ నాయకుల కనుసన్నల్లో వీరు పనిచేయాల్సి వచ్చింది. ఇంత చేసినా వేతనం అతి తక్కువ. ఎన్నికల్లో ప్రభుత్వం మారితే.. తమ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన వీరిలో ఉంది. దీన్నే వైసీపీ అనుకూలంగా మార్చుకుంది. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని నమ్మబలికింది. ఇదే సమయంలో వైసీపీ నేతల వెంట ప్రచారంలో ఉన్న వలంటీర్ల సమాచారం ఫొటోలు సహా వెలుగులోకి రావడంతో వీరిపై చర్యలు తీసుకుంటున్నారు. 'మీకిక మరోదారి లేదు.. రాజీనామాలు చేసి వచ్చేయండి ఈ రెండు నెలలూ రెట్టింపు జీతాలు ఇస్తాం' అని ఆ పార్టీ నాయకులు ఎర వేయడంతో వలంటీర్లు కూడా మూకుమ్మడిగా రాజీనామాలు చేసేయడం మొదలు పెట్టారు. తిరుపతి జిల్లాలో 196 వార్డు, 495 గ్రామ సచివాలయాలు చొప్పున మొత్తం 691 సచివాలయాల పరిధిలో 11875మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.వారిలో గత నెల ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత 300మందికి పైగా రాజీనామా చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని 18మందిని తొలగించారు. వైసీపీ నేతలు ఒత్తిడి పెంచి పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేయించడం మొదలుపెట్టారు. చంద్రబాబు ప్రకటనతో వలంటీర్లు ఆలోచనలో పడ్డారు.

కాస్తో కూస్తో చదువుకున్న అనేకమంది, అందులోనూ మహిళలు వలంటీర్లుగా చేరారు. స్థానికంగా ఉండే వైసీపీ నాయకుల అండదండలతోనే ఎక్కువమంది ఈ కొలువుల్లో కుదురుకున్నారు.ఈ నాయకుల రుబాబు ఎక్కువైనా మౌనంగా భరిస్తున్నారు. ఉన్న చోటనే ఆ కాస్త డబ్బులైనా వస్తున్నాయనే సంతృప్తితో పనిచేస్తున్నారు. కరడుగట్టిన వైసీపీ అనుచరులు మినహా, ఇటువంటి వారిలో చంద్రబాబు ప్రకటన కొత్త ఆశను చిగురింపజేసింది. పదివేలు అంటే తక్కువేమీ కాదు. పైగా వలంటీరు వ్యవస్థ కొనసాగుతుందని చెబుతున్నారు. ఈ నెల రోజులూ రాజీనామా చేయకుండా, ఏదోలా సాగదీసేస్తే చాలు కదా అనుకుంటున్నారు. రాజీనామా చేసేయాలనే నిర్ణయం తీసుకున్న వారు కూడా పునరాలోచనలో పడుతున్నారని తెలిసింది. బుధవారం వెంకటగిరి మున్సిపాలిటీలో 45 మంది, రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో ఏడుగురు మాత్రమే రాజీనామా లేఖలు అందజేశారు. జిల్లాలో మరెక్కడా ఎవరూ రాజీనామా చేయలేదు. దీన్నిబట్టి చూస్తే ఎన్నికల్లో ఎడాపెడా వాడేద్దాం అనుకున్న వలంటీర్లు వైసీపీ ఆశించినట్టుగా ఉపయోగపడేట్టు లేరు. అయితే చంద్రబాబు మాటలు నమ్మొద్దు అని వైసీపీ నాయకులు వీరి వెంటపడుతున్నట్టు తెలుస్తోంది. వలంటీర్లకు పది వేలు ఇస్తామన్న హామీని ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే తమకు మరింత నమ్మకం కలుగుతుందని కొందరు వలంటీర్లు అంటున్నారు. ఇదే జరిగితే వలంటీరు వ్యవస్థ మొత్తం వైసీపీని వదిలి చంద్రబాబు వైపు చేరే అవకాశం ఉందంటున్నారు.

15 నుంచి వేటకు విరామం



తూపిలిపాళెం తీరం వద్ద ఒడ్డుకు చేర్చివున్న పడవలు

కోట, ఏప్రిల్ 10 :ప్రతి ఏడాది మాదిరిగానే సముద్ర జలాల్లో 61రోజుల పాటు చేపల వేటను నిషేధిస్తున్నట్లు కోట మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రెడ్యానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.కోట, వాకాడు మండలాలతో పాటు చిల్లకూరు మండలంలోని గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతాలకు సంబంధించి సముద్రంలో చేపలవేటను ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. సముద్ర జలాల్లో చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి, గుడ్లు పెట్టేకాలంలో తల్లి చేపలను, తల్లి రొయ్యలను పరిరక్షించడంతోపాటు వాటి సంతతిని ప్రోత్సహించడం కోసం చేపలవేటను నిషేధించినట్లు తెలిపారు.వేట విరామ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాధి కోసం రూ.10 వేలు అందించడం జరుగుతుందన్నారు.ఎవరైనా చేపల వేటకు వెళ్లితే వారి బోట్ లైసెన్స్, హెచ్ఎస్‌డీ ఆయిల్‌కార్డు, మత్స్యకార భరోసా కింద ఇచ్చే రూ.10వేలు రద్దు చేయడం జరుగుతుందన్నారు.నిషేధ కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.చేపల వేట విరామానికి 4 రోజులు మాత్రమే సమయం ఉండటంతో కోట మండలంలోని గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, శ్రీనివాసనత్రం గ్రామాల సమీపంలోని సముద్రపు ఒడ్డున ముందుగానే తమ పడవలు, వలలను మత్స్యకారులు భద్రపరుచుకున్నారు.

ముగ్గురు ఎస్వీయూ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కారణం

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. కొన్ని రోజుల క్రితం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందినట్టు సమాచారం. దీంతో చర్యల కోసం ఎన్నికల కమిషన్ యూనివర్సిటీ అధికారులను ఆదేశించిన క్రమంలో అయ్యప్ప (డ్రైవర్), డాక్టర్ ఐఎస్ కిషోర్ మాథ్యూ అర్నాల్డ్ (అకడమిక్ కన్సల్టెంట్), మురళిరెడ్డి (రిజిస్ట్రార్ పీఎస్) లను సస్పెండ్ చేసినట్టు సమాచారం.ఈ ముగ్గురినీ విధుల నుంచీ తొలగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ బుధవారం ఉత్తర్వులు వెలువరించినట్టు సమాచారం.

ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందే!

- ఎస్వీయూ వీసీకి కమిషనర్ సూచన

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది.ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందేనని విచారణాధికారిగా ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ సూచించినట్టు తెలుస్తోంది. బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వీసీ శ్రీకాంత్ రెడ్డి మరోసారి విచారణకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత విధుల్లో చేరిన 12 మంది నాన్ టీచింగ్ సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లతోనే నియమించినట్లు విచారణలో వెల్లడైనట్టు సమాచారం. దీంతో వారిని తొలగించాలని ఎన్నికల అధికారులు వీసీకి సూచించినట్టు తెలుస్తోంది.

టౌన్ బ్యాంకు మేనేజర్ సస్పెన్షన్

వైసీపీ ఆత్మీయ సభలో పాల్గొన్న ప్రభావం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తిరుపతి కోఆపరేటివ్ (టౌన్ బ్యాంకు)బ్యాంకు మేనేజర్ ప్రభాకర రెడ్డి (పాండు)పై బుధవారం సస్పెన్షన్ వేటు పడింది. టౌన్ బ్యాంకు మాజీ ఉద్యోగులకు మెడికల్ బిల్స్ ఇస్తామని శనివారం ఒక హోటల్‌కు పిలిపించి వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డితో సమావేశం ఏర్పాటుచేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ ఆత్మీయ సభలో టౌన్ బ్యాంకు మేనేజర్' శీర్షికన వైసీపీ అభ్యర్థితో కలిసి అతను చేతిలో మైకు పట్టుకున్న ఫొటోతో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎన్నికల అధికారి స్పందిస్తూ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కాగా టౌన్ బ్యాంకు కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో ఉండడం వలన రాజకీయ పార్టీ నేతలతో కలవకూడదన్న నిబంధన ఉన్నట్టు తనకు తెలియదని పాండు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆయన వివరణపై సంతృప్తి చెందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశాలివ్వడంతో ఆ మేరకు అతనిపై వేటు పడింది.

విచ్చలవిడిగా తాయిలాల తరలింపు...?



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో నెంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న కారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తిలో ఓటర్లకు అందించేందుకు అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తాయిలాలు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ముఖ్య నేత కుమార్తె ఆర్టీసీ బస్టాండ్‌కు ఆనుకొని అపార్ట్మెంట్లు ఉండే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటి వద్ద నుంచి నెంబర్ ప్లేట్లు తొలగించిన కార్లు నియోజకవర్గం మొత్తం చక్కర్లు కొడుతున్నాయి. రాత్రి వేళల్లో ఆమె ఇంటి నుంచి బయలుదేరుతున్న కార్లు కానుకలతో గ్రామాలకు చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెంబర్ ప్లేట్ లేని కారుపై ఎమ్మెల్యే అనే స్టిక్కర్ కూడా ఉండడం గమనార్హం.చీరలు, పలు రకాల కానుకలు ఉన్నట్లు సమాచారం.

'రంజాన్ తోఫా' ఏదీ?

జగనన్న పాలనలో ముస్లింలకు అన్నీ మైనసే

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 10 : టీడీపీ హయాంలో ఇస్తున్న రంజాన్ తోఫాకు మరిన్ని సరుకులు కలిపి ఇస్తామని 2019లో రంజాన్ సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్ చెప్పారు. 2020 నుంచి ఇస్తామన్నారు. ఆ మాటలను నిజమని మైనారిటీలు నమ్మారు. కానీ, ఐదేళ్లయినా రంజాన్ తోఫా ఇవ్వలేదు. మాట నిలబెట్టుకోలేదు. 'మైనార్టీ వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు మిగిలివున్న చర్యలు చేపడతాం. ఆ పార్టీ (టీడీపీ) చేసిందేమి లేదు. మా పార్టీయే (వైసీపీ) ఎంతో చేసింది' అని చెప్పడమే కానీ చేసిందేమీ లేదని ముస్లింలు అంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో బియ్యం కార్డున్న ముస్లిం కుటుంబాలకు చంద్రన్న రంజాన్‌తోఫా కిట్ అందించేవారు. వాటిలో రెండు కిలోల చక్కెర, ఐదు కిలోల గోధుమ పిండి, కిలో సేమియా, వంద గ్రాముల నెయ్యి వంటి సరుకులు ఉండేవి. వీటితో పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకొనే వారు. దీనికి మరిన్ని సరుకులు కలిపి ఇస్తానని అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ మాటే మరిచారు. ముస్లింల ఇంట పండుగంటే గోధుమలు, సేమియాలు, చక్కెర ఉండాల్సిందే. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే నిత్యావసరాల్లో గోధుమ పిండి, కందిపప్పును రెండు నెలలుగా నిలిపేసింది. కేవలం అర కిలో చక్కెర మాత్రం అందిస్తోంది. దీంతో పండుగ రోజున ఇంటిల్లిపాదీ చక్కెరతో పాయసం(ఖీర్) చేసుకోవాలన్నా కిలో పైనే చక్కెర అవసరమవుతుంది. రేషన్ దుకాణాల్లో ఇచ్చే అరకిలో చక్కెర సరిపోక మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

షాదీఖానా, ఈద్గాల ఊసేలేదు

ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిని వైసీపీ పూర్తిగా విస్మరించింది.టీడీపీ పాలనలో షాదీఖానాల నిర్మాణం, మసీదులకు మరమ్మతులు, ఈద్గాల అభివృద్ధి, ప్రహరీల నిర్మాణానికి ప్రతీ ఏడాదీ నిధులు మంజూరు చేసేవారు.వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వీటి జాడే లేదు. పలుమార్లు మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయీ మంజూరు కాలేదని ముస్లిం సోదరులు వాపోతున్నారు. తిరుపతి, సూళ్లూరుపేట, గూడూరుల్లోని షాదీఖానా భవనాల మరమ్మతులకు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా ఇంత వరకు పట్టించుకున్న వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చినప్పుడే గౌరవ వేతనాలు

జిల్లాలో సుమారు 450కి పైగా మసీదులున్నాయి. వీటిల్లో 350మందికి పైగా ఇమామ్‌లు(ఆరాధకులు), మౌజన్‌లు(మసీదు సేవకులు) ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వీరికి గౌరవ వేతనం అందేది.ప్రస్తుతం ఆరు నెలలుగా గౌరవ వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రంజాన్ పండుగను కూడా సంతోషంగా చేసుకోలేకపోతున్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెల నెలా గౌరవ వేతనాలు అందేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వారిచ్చినప్పుడు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు మౌజన్లు, ఇమామ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే ఆ మరుసటి రోజునే దేవుడి సేవ నుంచి తప్పిస్తున్నారంటున్నారు.

దుల్హన్ సాయం ఆగిపోయింది

నిరుపేద ముస్లింలు సైతం వారి ఇంట్లో నిఖా వేడుకను ఉన్నంతలో వైభవంగా జరుపుకుంటారు. నిఖా చేయడం ఆర్థిక భారం కాకూడదనే ఆర్థిక చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం దుల్హన్ పథకం కింద నిఖా చేసుకున్న దంపతులకు ఆర్థికసాయం అందించేది. కానీ ప్రస్తుతం దుల్హన్ పథకం అందని ద్రాక్షలా మారింది. దీంతో ఈ పథకం అండగా ఉందనే ధీమాతో అప్పులు చేసి మరీ వారి బిడ్డలకు నిఖా చేసిన వారికి ఈ పథకం అందక అప్పులకు వడ్డీలు కట్టుకోవాల్సి వస్తోంది. జిల్లాలో దాదాపు ఐదు వందలకు పైగా జంటలు దుల్హన్ పథక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.



బస్టాండు ఆవరణలో పడమర వైపు స్థలంలో వైసీపీ నేతల బినామీలు నిర్మించిన గదులు



బస్టాండు ఆవరణలో దక్షిణం వైపు పంచాయతీ దుకాణాలలో ఖాళీగా ఉన్న గదులు

పంచాయతీ ఆదాయానికి ప్రజాప్రతినిధుల గండి!

రేణిగుంట, ఏప్రిల్ 10 : పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సిన ప్రజాప్రతినిధులే ఆదాయానికి గండి కొడుతున్న వైనం రేణిగుంట పంచాయతీలో కన్పిస్తోంది.మేజర్ పంచాయతీ అయిన రేణిగుంటకు సంవత్సరానికి సరాసరి రూ.3కోట్ల ఆదాయం ఉండగా ఖర్చు మాత్రం రూ.4కోట్ల పైనే వుంది.పంచాయతీకి దాదాపు రూ.50లక్షల పైచిలుకు రుసుములు రావాల్సి వుంది.స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం పడమర వైపు ఏడు పంచాయతీ దుకాణాలను, పంచాయతీ కాలువపై మరో ఏడు దుకాణాలను తొలగించారు. అప్పట్లో ఈ విషయం పంచాయతీలో పెద్ద దుమారం రేపింది.వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ట్రాఫిక్ సమస్య ఉన్న చోటే ఆ పార్టీ నాయకులే ఏడు గదులు నిర్మించారు. ఒక్కో దుకాణాన్ని నెలకు రూ.3,990 ధరకు బినామీల పేరుతో తీసుకుని పెద్దమొత్తంలో అడ్వాన్సులతో పాటు నెలకు రూ.15వేలకు బయటి వ్యక్తులకు బాడుగలకు ఇచ్చారు.గతంలో ఇక్కడున్న పంచాయతీ దుకాణాల్లో ఒక్కో దుకాణం నుంచి వేలంపాటల ద్వారా రూ.15వేల నుంచి రూ.20వేల దాకా పంచాయతీకి ఆదాయం సమకూరేది. అయితే ఈ దుకాణాలు నిర్మించుకుని దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెల్లించకపోవడం గమనార్హం.బస్టాండు వద్ద దక్షిణం వైపు నిర్మించిన పంచాయతీ దుకాణాల్లో మొదటిది తప్ప మిగిలిన దుకాణాలు అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఖాళీగా పడివున్నాయి.పోస్టాఫీసు వీధిలో పంచాయతీకి చెందిన మూడు దుకాణాల నుంచి ఆదాయం వస్తున్నప్పటికీ కాలం తీరిపోయిన నిర్మాణాలంటూ తొలగించి కొత్త గదులు నిర్మించి అద్దెకివ్వాలని వైసీపీ నేతలు ప్రయత్నం చేయగా తీవ్ర విమర్శలు రావడంతో వెనకడుగు వేశారు. గదులు తొలగించిన ఆ స్థలంలో ఇప్పటికీ గదులు నిర్మించకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడింది.

ఏటీఎంలా మారిన ఎంబుక్..?

పంచాయతీ పరిధిలో ప్రజల అత్యవసరాలకు పనులు చేయించి ఆ బిల్లులను ఎంబుక్‌లో రికార్డు చేశాక ఉన్నతాధికారులు సంతకాలు చేస్తే బిల్లులు డ్రా చేసుకుంటారు. అయితే పొక్లయినర్ గంట పనిచేస్తే రెండురోజులు పని చేసినట్లు, ఒక వీధిలో సున్నం కొడితే పంచాయతీ మొత్తం ముగ్గుపిండి కలిపిన సున్నాన్ని కొట్టినట్లు ఎంబుక్‌లో నమోదు చేసుకుని బిల్లులు కాజేస్తున్నారన్న ఆరోణలున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పంచాయతీ నిధులు ఇలా దుర్వినియోగం అవుతున్నాయని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయని స్థానికులు భావిస్తున్నారు.

కరోనాలోనూ ముక్కు పిండి వసూళ్లు

కరోనా కాలంలోనూ ఏడాది పాటు పంచాయతీలో కూరగాయల మార్కెట్,బస్టాండులో వచ్చి పోయే వాహనాలు, సంత గేటు టెండర్లు దక్కించుకున్న వైసీపీ నేతల బినామీలు ముక్కుపిండి వసూలు చేశారు కానీ కలెక్షన్లు రాలేదని కరోనా సాకు చూపుతూ తీర్మానం చేసి అధికారులకు నివేదిక పంపారని విమర్శలున్నాయి.

అనధికారికంగా పంచాయతీ ఉద్యోగాలు

రేణిగుంట పంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా అవసరాలు తీర్చేందుకు 65మంది కార్మికులను నియమించుకునేందుకు కలెక్టర్ అప్రూవల్ వుంది.అయితే వైసీపీ హయాంలో జరిగిన ఎన్నికల తరువాత ఏర్పడిన పంచాయతీ బోర్డు మరో 48మందిని తీసుకుని నెలకు ఒక్కొక్కరికి రూ.11వేల చొప్పున జీతాలు చెల్లిస్తోంది. వైసీపీ నాయకుల సిఫార్సు మేరకు తీసుకున్న వీరిలో పంచాయతీ కార్యాలయం లోపలే పదిమంది పనిచేస్తున్నారని, మరో ఇద్దరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్నారని చూపుతున్నారు. ఆఖరుకు పార్టీ కార్యాలయంలో కూడా పనిచేసే ఇద్దరికి కూడా పంచాయతీ ఖాతాలో నుంచే జీతాలు చెల్లిస్తున్నారు. మిగిలిన వ్యక్తులు ఎక్కడ పనిచేస్తున్నారో, వీరి జీతాలు ఎవరు తీసుకుంటున్నారో ఎవరికీ తెలియదు.



పోస్టాఫీసు వీధిలో పంచాయతీ గదులు కొట్టివేయడంతో ఖాళీ జాగాలో పూల దుకాణాలు

ఓటు వేయాలంటే గుర్తింపుకార్డు తప్పనిసరి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఓటర్‌కార్డు (ఎపిక్‌కార్డు) లేనివారు ప్రత్యామ్నాయంగా ఆధార్, జాబ్, పాన్‌కార్డులు, బ్యాంకు, పోస్టాఫీస్ జారీ చేసే ఫొటోతో కూడిన పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్ ఇలా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే సరిపోతుందన్నారు.

విలువలతో కూడిన రాజకీయాలు చేయండి

● చెవిరెడ్డికి టీడీపీ నాయకుల హితవు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 10: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి హితవు పలికారు. బుధవారం చంద్రగిరి టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ వైఫల్యాలు ఉంటే విమర్శించాలే గానీ, కార్యకర్తలను బెదిరించడం, దళితుల మధ్య చిచ్చు పెట్టడం, విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు. చెవిరెడ్డి కుటుంబ పాలన చేస్తున్నారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వలేదన్నారు. చెవిరెడ్డి గెలుపు కోసం పనిచేసిన వారందరూ విశ్వాసం కోల్పోయి టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. చంద్రగిరిలో ఓడిపోతాననే ఆయన ఒంగోలుకు మకాం మార్చారన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, నాయకులు గౌస్‌బాషా, లోకాద్రినాయుడు, మాజీ జడ్పీటీసీ అమ్ములు, పోట్లూరి రామారావు, రాజులుగారి వినోద్‌రెడ్డి, సక్కూరి ధనంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జారెడ్డి మృతికి పలువురి నివాళులు


బొజ్జారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మురళి తదితరులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: అనారోగ్యంతో మృతి చెందిన టీటీడీ అటవీశాఖ విశ్రాంత ఉద్యోగి బోడిరెడ్డి బొజ్జారెడ్డికి సీపీఎం నేత కందారపు మురళి బుధవారం నివాళులర్పించారు.రేకలచేనులో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేశారు.టీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నాగార్జున, టీటీడీ ఎంప్లాయిస్ అసోసియేషన్ లీడర్ గుణశేఖర్,టీటీడీ పెన్షన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మునిరాజా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఈఆర్వో ఉషారాణి కోరారు. సొరకాయలపాళెం, కేకేవీపురం, బ్రాహ్మణ కాల్వ గ్రామాల్లో ఓటుహక్కుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఈ మృతదేహం ఎవరిదో?



రామచంద్రాపురం, ఏప్రిల్ 10: తిరుపతి-పచ్చికాపలం ప్రధాన రహదారిలో సంజీవరాయపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. పోలీసులకు పరిశీలించి శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనారోగ్యంతో మృతి చెందాడా, లేదా బలవర్మణానికి పాల్పడ్డాడా అనేది తేలాల్సి ఉంది. మృతుడు నీలిరంగు లుంగీ, లేత నీలిరంగు చొక్క ధరించి ఉన్నాడు.

పరీక్షలకు స్మార్ట్ టీవీ వినియోగం

పాకాల, ఏప్రిల్ 10: వార్షిక పరీక్షలకు స్మార్ట్ టీవీలను వినియోగించాలని ఎంఈవో బాబ్జీ అన్నారు. బుధవారం ఆయన ఎన్వీఎన్, తలారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల తీరును తనిఖీ చేశారు. టీవీలలో చూపించి 3,4,5 తరగతుల విద్యార్థులతో పరీక్షా పేపర్లను రాయించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మోహన్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఈఈయూ 1104 నూతన కార్యవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న దేవేంద్ర రెడ్డి

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్ 10 : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (1104) తిరుపతి సర్కిల్ కార్యాలయం, తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ డిస్కం కార్యదర్శి దేవేంద్ర రెడ్డి తెలిపారు. టెలికం కాలనీలోని 1104 యూనియన్ కార్యాలయంలో బుధవారం మూడు డివిజన్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు సమస్యలను ఎప్పటి కప్పుడు డివిజన్ స్థాయి నాయకుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తిరుపతి టౌన్ డివిజన్ అధ్యక్షుడిగా కె.దామోదర్ రెడ్డి, కార్యదర్శిగా వెలకటూరి గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.మహదేవరెడ్డి, రూరల్ డివిజన్ అధ్యక్షుడిగా ఏ.మునస్వామి, కార్యదర్శిగా వి.నందగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.చంద్రశేఖర్, తిరుపతి సర్కిల్ కార్యాలయ అధ్యక్షుడిగా యశ్వంత్ కుమార్, కార్యదర్శిగా త్యాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలసుబ్రమణ్యం ఎన్నికయ్యారని వెల్లడించారు.

ఎలక్ట్రిసిటీ యూనియన్ డివిజన్ కార్యవర్గం


మునస్వామి


నందగోపాల్

పాకాల, ఏప్రిల్ 10: ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 తిరుపతి డివిజన్ కార్యవర్గ ఎన్నికలు తిరుపతి డిస్కం కార్యదర్శి వి.దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి. డివిజన్ అధ్యక్షుడిగా ఎ.మునస్వామి, డివిజన్ కార్యదర్శిగా పి.నందగోపాల్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.చంద్రశేఖర్, డివిజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్, ట్రెజరర్‌గా సిద్దముని నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిర్మాణ వ్యర్థాలతో కనుమరుగవుతున్న కుంట


నిర్మాణ వ్యర్థాలతో పూడ్చేస్తున్న కుంట

పాకాల, ఏప్రిల్ 10: రైల్వే అండర్ బ్రిడ్జి సమీపాన పాకాల-దామలచెరువు రహదారి పక్కనున్న కుంటను భవన నిర్మాణ వ్యర్థాలతో నింపేస్తు న్నారు. పాకాల పెద్దవంక సమీపంలోని ఈ కుంట లోతుగా ఉండడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉంటుంది. ఫలితంగా పరిసర బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. పాకాల-దామలచెరువు రహదారి, అగ్రహారం వెళ్లే దారికి పక్కనే ఉన్న ఈ కుంటను నిర్మాణ వ్యర్థాలతో పూడ్చేస్తుండడంతో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. విలువైన స్థలం కావడంతో వ్యర్థాలతో నింపేసి తర్వాత ఆక్రమించుకోవచ్చనే ఉద్దేశంతో కొందరు నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి కుంటను పరిరక్షించాలని వీరు కోరుతున్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం


బీటీఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళం, ఏప్రిల్ 10: మంగళం పరిధిలోని మంగళం,సప్తగిరి పంచాయతీల్లో బీటీఆర్‌పురం, పద్మావతినగర్, మోడల్‌కాలనీల్లో టీడీపీ నేతలు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజవర్గంలో సమస్యల పరిష్కారం నానీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో శెట్టిపల్లి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, సురేష్ బాబు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మంగళం పంచాయతీ అధ్యక్షులు సురేష్‌నాయుడు, నాయకులు రవిచంద్ర, బాలాజీప్రసాద్,మహేశ్వరి, గోపీనాథ్, భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు కిషోర్, సాయి. విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


అమ్మవారి ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్

తిరుచానూరు, ఏప్రిల్ 10: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏఈవో రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం జస్టిస్ సంజయ్ కరోల్‌ను ఆలయ వేదపండితులు వేదాశీర్వాదం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ మధు పాల్గొన్నారు.

హనుమంత, గజ వాహనాలపై ఆది పురుషుడు



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 10: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారు హనుమంతవాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 నుంచి 11.30 వరకు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7నుంచి 8.30 వరకు కోదండరాముడు గజ వాహనంపై మాడవీధులలో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమల పెద్ద జియ్యర్, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో, రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


ఎమ్మార్‌పల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎమ్మార్‌పల్లి సీఐ అహ్మద్ కోరారు. బుధవారం కేంద్ర బలగాలు అవిలాల, చెన్నప్పకాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఆర్డీవో నిషాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. సీఐ అహ్మాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు చాలా గ్రామాల్లో ఓటర్లకు చైతన్యం కల్పించామని తెలిపారు. అలాగే ఎస్వీయూ స్టేషన్ పరిధిలోనూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామాంజనేయులు, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

అలరించిన భువన విజయం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 10: శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శించిన భువన విజయం ప్రేక్షకులను అలరించింది. శ్రీకృష్ణదేవరాయలు - ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, మహామంత్రి తిమ్మరుసు- ఆచార్య కె.సర్వోత్తమరావు, అల్లసాని పెద్దన - మేడసాని మోహన్, ధూర్జటి - ఆముదాల మురళి, తెనాలి రామకృష్ణుడు - ఆకెళ్ల విభీషణ శర్మ, నంది తిమ్మన - మద్దూరి ఆదిత్య శర్మ, రామరాజభూషణుడు - పరమేశ్వరయ్య, పింగళి సూరణ - గంగిశెట్టి లక్ష్మీనారాయణ, అయ్యలరాజు రామభద్రుడు - వై.వెంకటేశ్వర్లు, మాదయగారి మల్లన - నాదెళ్ల శ్రీమన్నారాయణ తమ పాత్రలను రసవత్తరంగా పోషించారు. చక్కటి పద్యాలాపనతో అకట్టుకున్నారు. అనంతరం కళాకారులను సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల, పూర్వ ప్రిన్సిపాల్ తిరుపతి సుధాకర్ సత్కరించారు.

ఆదరించండి.. అండగా ఉంటా: పులివర్తి నాని


టీడీపీలో చేరిన వారితో పులివర్తి నాని, చిన్నబాబు

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరిస్తే ఎళ్లవేళ్లలా అందుబాటులో ఉంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆర్‌సీపురంలో బుధవారం టీడీపీ కార్యాలయాన్ని నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం పదేళ్లగా అభివృద్ధికి దూరమైందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి స్వార్థ రాజకీయాలు తప్పా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. తాను గెలిస్తే రాయలచెరువు అభివృద్ధితో పాటు అనుపల్లి పనబాకం రోడ్డును ఆర్అండ్‌బీగా చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన్‌చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, జేడీ జ గన్, హరిప్రసాద్, డిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, నీలకంఠ చౌదరి, మునెయ్య, మండల నాయకులు గిరినాయుడు, ప్రసాద్, జీవరత్నం, జయచంద్రనాయుడు, సురేంద్రనాయుడు, మధుసూదన్‌రెడ్డి, దినేష్, అర్జున్‌నాయుడు, మునిరామిరెడ్డి పాల్గొన్నారు.

●రామచంద్రాపురం, ఏప్రిల్ 10: రామాపురానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు ముద్దు కృష్ణారెడ్డి టీడీపీ అభ్యర్థి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. పద్మవల్లిపురానికి చెందిన కిరణ్, సుబ్బయ్య, జానకీరామ్‌తో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరందరికీ నాని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

బీసీ పునాదులపై తెలుగుదేశం పార్టీ: సుధారెడ్డి


జయహో బీసీ సదస్సుకు హాజరైన ప్రజలు

పాకాల, ఏప్రిల్ 10: బీసీ పునాదిపై తెలుగుదేశం పార్టీ నిలబడి ఉందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. కావలివారిపల్లెలో బుధవారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాలలో ఎదిగేలా కృషిచేశారన్నారు. 13 కార్పొరేషన్‌ల ద్వారా అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికలలో చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగురుతుందన్నారు. మండల టీడీపీ జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

●తిరుపతిరూరల్, ఏప్రిల్10: టీడీపీ అధికారంలోకి వచ్చాక అవిలాలను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామని టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలో అవిలాల పంచాయతీ సుబ్బయ్యకాలనీలో బుధవారం ఆమె ప్రచారం నిర్వహించారు. రౌడీయిజం, దౌర్జన్యాలు, కబ్జాలు, దాడులు, ఆక్రమణలు లేని పాలన కావాలంటే టీడీపీని ఆదరించాలని కోరారు.

కొత్తభవనంలోకి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్



కొత్తభవనంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ సేవలు

తిరుపతి రూరల్,ఏప్రిల్10: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరంలో ఎట్టకేలకు కొత్తభవనంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యసేవలను ప్రారంభించారు. భవనం ప్రారంభించినా వైద్య సేవలు ప్రారంభించని వైనంపై ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో ప్రచురతమైన కథనానికి అధికారులు స్పందించారు. అయితే ఈభవనంలో రోగుల, వైద్యుల అవసరాలకు అనుగుణంగా ఇప్పటికీ సరైన సౌకర్యాలను కల్పించలేదు. మందులు, ల్యాబ్ పరికరాలు వంటివి అట్టపెట్టెల్లో ఓగదిలో నేలపైనే ఉంచారు. వాటర్ కనెక్షన్ కల్పించలేదు. వైద్యసిబ్బందికి కనీసం వాష్‌రూమ్ కూడా లేదు. సింకు నుంచి వచ్చే నీరు డ్రైనేజీ కాలువలోకి వెళ్లేందుకు కనెక్షన్ ఇవ్వలేదు. అరకొర సౌకర్యాలతో కేంద్రాన్ని నిర్మించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


నేలపై అట్టపెట్టెలో మందులు, వైద్యపరికరాలు

వైసీపీ కార్యక్రమంలో టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి

●ఎన్నికల కోడ్ బేఖాతరు చేసి మరీ...


చెవిరెడ్డి తదితరులతో టీటీడీ ఉగ్రాణం జగన్ (వృత్తంలో ఉన్న వ్యక్తి)

చంద్రగిరి, ఏప్రిల్ 10: చంద్రగిరి కొత్తపేటకు చెందిన టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి ఉగ్రాణం జగన్ బుధవారం వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ అనుబంధ సంస్థల కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా రాజకీయ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనకూడదని ఉగ్రాణం జగన్ తిరుమల శ్రీవారి పోటులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం తిరుపతి రూరల్ తుమ్మలగుంటలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద జరిగిన వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఎన్నికల సంఘం ఆదేశాలను బేఖాతర్ చేసి ఇలా రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఉగ్రాణం జగన్‌ను టీటీడీ వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.ఇతను పాల్గొన్న ఫోటోలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.



వరదయ్యపాళెం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, పక్కన టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం

పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదాం: వరప్రసాద్

వరదయ్యపాళెం/వెంకటగిరి, ఏప్రిల్ 10: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదామని ఆ పార్టీల తిరుపతి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి, గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో బుధవారం జరిగిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలోని పెత్తందారుల అడుగులకు తాము మడుగులు ఒత్తలేదన్న కారణంగా కక్ష కట్టి పార్టీ నుంచీ తనను, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని బయటికి పంపించేశారని ఆరోపించారు. దేశం, మన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుండాలన్నారు. అందుకే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ టీడీపీ- జనసేన -బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన చారిత్రక అవసరముందన్నారు. సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్, పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, అధికార ప్రతినిధి నాగరాజు, హరిచౌదరి, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జయచంద్రనాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు పురుషోత్తం, ఎస్సీసెల్ అధ్యక్షులు మునికృష్ణయ్య, సిద్ధులయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాకు వాసు, రాఘవయ్య, దొరబాబు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరిలో సభలో వరప్రసాద్, లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరిలో ఆత్మీయ సమావేశం

వెంకటగిరిలో నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్ పాల్గొన్నారు. కేంద్రంలో మోదీ ప్రధాని కావడం కోసం తిరుపతి నుంచీ బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని, దానికోసం శ్రేణులు కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

15న సారంగపాణి కార్యశాల

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 10: టీటీడీ, శ్వేత ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన సారంగపాణి కార్యశాల నిర్వహించనున్నారు. శ్వేతలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సభా మందిరంలో ఉదయం 10 గంటలకు సభ మొదలవుతుందని శ్వేత అధ్యక్షుడు భూమన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి రామాయణ సప్తాహం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 10 : రామకృష్ణ ఆశ్రమం తిరుపతి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నుంచి 17వ తేదీ వరకు రామాయణ సప్తాహం జరుగుతుందని ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. ఆశ్రమంలోని వివేకానంద మందిరంలో రోజూ సాయంత్రం 6.30నుంచి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

రుయాలో డ్రైవర్ల అవస్థలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 10 : రుయాస్పత్రిలో అంబులెన్సుల డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. రోగులను వార్డుల వద్దకు, చిన్నపిల్లల వార్డు, ప్రసూతి ఆస్పత్రి, ఇతర వైద్య పరీక్షలకు తీసుకువెళ్లేందుకు రోజూ మూడు షిఫ్టుల్లో ముగ్గురు డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. కొత్త డ్రైవర్ల నియామకం చేపట్టకపోగా ఉన్న అవుట్ సోర్సింగ్ వారిని తొలగించడంతో కేవలం ముగ్గురు మాత్రమే మిగిలారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా సెలవు తీసుకుంటే మిగిలిన ఇద్దరిలో ఒకరు అదనంగా మరో షిఫ్టు చేయాల్సి వస్తుంది. సాధారణంగా డ్రైవర్లకు వారంలో ఒకరోజు వారాంతపు సెలవు ఇవ్వాలనే నిబంధన ఉన్నా తీసుకునే అవకాశం లేకపోతోంది.

మాఫియాతో కలసి చెవిరెడ్డి విచ్చలవిడి దోపిడీ

టీడీపీ అభ్యర్థి నాని ధ్వజం


పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ నవనీతమ్మ, వైసీపీ కార్యకర్తలు

తిరుపతిరూరల్,ఏప్రిల్10: వైసీపీ ప్రభుత్వంలో నాలుగు పదవులు పొందిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి గొప్ప పనులు చేపట్టకపోగా మఠం భూముల ఆక్రమణ, ఇసుక, మైనింగ్, ఎర్రచందనం మాఫియాలతో కలసి విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడ్డారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని విమర్శించారు. తిరుపతి రూరల్ మండలం వెంకటపతినగర్ పంచాయతీలో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్‌కి గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడికూటమి నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా నాని మీడియాతో మాట్లాడుతూ అక్రమసంపాదన, కక్ష సాధింపుసకే చెవిరెడ్డి అధికారాన్ని వాడుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే, వైసీపీ పాలనపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ఐదేళ్లుగా సైకోపాలనపై పోరాడుతున్నామన్నారు. వేధింపులకు గురైనా పోరాడుతున్న కార్యకర్తలు, నాయకులే టీడీపీకి బలమని ఉద్ఘాటించారు. అంతకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నానికి శాలువాకప్పి గజమాలతో స్వాగతం పలికారు. టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ వర్గం

చంద్రగిరి, ఏప్రిల్ 10: చంద్రగిరి పంచాయతీలోని మాజీ ఎంపీటీసీ నవనీతమ్మ, ఆమె వర్గీయులు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో నవనీతమ్మతోపాటు ఆమె వర్గీయులు మునిరామిరెడ్డి, అరుణ, చెంగమ్మ, లక్ష్మీ, మరి కొంత మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నాని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నాని గెలుపు కోసం కష్టించి పని చేస్తామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, గౌస్ బాషా, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, గురుమూర్తిరెడ్డి, కేశవులునాయుడు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 10: ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో బుధవారం జిల్లా వైద్యాధికారి శ్రీహరి, ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి సిబ్బందికి, ప్రయాణికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ఉన్న బస్టాండ్లలో, బస్సుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వడదెబ్బ లక్షణాలు, అధిక దాహం అనిపిస్తే తాగాలన్నారు.

కాంగ్రెస్ నా కష్టాన్ని గుర్తించలేదు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ తన శ్రమను గుర్తించలేదని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఊరందూరు గ్రామానికి చెందిన రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడుతూ ప్రజల్లోనే ఉంటూ విశేష సేవలందించానని తెలిపారు. చాలావరకు ఆస్తులు పోగొట్టుకున్నానని, ఇటువంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే సీటును మరొకరికి ఇవ్వడం బాధ కలిగించిందని అన్నారు. కాంగ్రెస్‌లో మహిళా రిజర్వేషన్ 33 శాతం అమలు కావడం లేదన్నారు. పీసీసీ చీఫ్ షర్మిళను కలిసి విషయం చెప్పినా లాభం లేకపోయిందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సీటు విషయమై అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు.

ఎన్నికల సమాచారం అప్‌డేట్‌గా ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉంచుకోవాలని డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల విధుల్లో ఉన్న నోడల్ అధికారులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. నివేదికలను అందుబాటులో ఉంచుకోవాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 14 మందికి అపరాధం

తిరుపతి(నేరవిభాగం),ఏప్రిల్ 10 :తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 14 మందికి అపరాధం విధించారు. వీరిని బుధవారం నాల్గవ జూనియర్ మొదటి తరగతి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేల చొప్పున అపరాధం విధించినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. అలాగే త్రిబుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 90 కేసుల్లో రూ.వెయ్యి, రూ.2వేలు చొప్పున అపరాధం విధించినట్లు వెల్లడించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 55,756 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,866 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు





పద్మశ్రీ - మహింద అమరవీర

తిరుమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో శ్రీలంక మంత్రి మహింద అమరవీర, తెలంగాణ ఎమ్మెల్యే శంకర్, ఏపీ ఎమ్మెల్సీ పద్మశ్రీ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.







పిచ్చి మొక్కలతో నిండిన సబ్ స్టేషన్ - ప్రమాదకరంగా ఎండిన మొక్కలు - ఇనుప కంచెపై ఆరేసిన తడి బట్టలు

రుయాలో అస్తవ్యస్తంగా విద్యుత్ వ్యవస్థ

సబ్‌స్టేషన్ చుట్టూ ముళ్ల పొదలు, తీగలు ● కంచెపై బట్టలు ఆరేస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 10 : రుయాస్పత్రిలో విద్యుత్తు వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఆస్పత్రికి విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే ప్రదేశంలో పిచ్చి మొక్కలు, చెట్లు కనిపిస్తున్నాయి. చిన్నపిల్లల వార్డు పక్కన ఉన్న సబ్‌స్టేషన్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. సబ్‌స్టేషన్ చుట్టూ ఉన్న కంచెల మీద రోగులు, వారి సహాయకులు తడి బట్టలను ఆరవేస్తున్నారు. పీజీ మహిళా వైద్యుల వసతిగృహం, సైకియాట్రీ వార్డు వెనుక, ప్రసూతి ఆస్పత్రి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి చిన్నపాటి నిప్పు రవ్వలు ఎగిరిపడినా అగ్ని ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్వీ వైద్య కళాశాల మార్చురీకి విద్యుత్తు అంతరాయం

● గంటల తరబడి సరఫరా లేకపోవడంతో దుర్వాసన





దుర్వాసన భరించలేక మార్చురీ ముందు ముక్కు మూసుకుని కూర్చొన్న మహిళ - మార్చురీ ముందు ముక్కుకు రుమాలు కట్టుకొని నిల్చున్న వ్యక్తి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 10 : ఎస్వీ వైద్య కళాశాల, దాని అనుబంధ మార్చురీకి బుధవారం నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. తద్వారా మృతదేహాల నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గుర్తు తెలియని మృతదేహాలను ఎస్వీ వైద్య కళాశాల మార్చురీలోని ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. మంగళవారం సెలవు కావడంతో ఆ రోజు మృతిచెందిన వారి దేహాలను కూడా పోస్టుమార్టం చేసేందుకు మార్చురీలో భద్రపరిచారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. 11 గంటల వరకు రాలేదు. ఆ సమయంలో మార్చురీలో తొమ్మిది మృతదేహాలు ఉన్నాయి. వీటిల్లో నాలుగు గుర్తు తెలియని మృతదేహాలు కావడంతో పది రోజులకు భద్రపరిచి ఉన్నారు. నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మృతదేహాలు డీకంపోజ్ అయ్యి దుర్వాసన వెదజల్లాయి. దీంతో ఈ మార్గాన వెళ్లే వారు, పక్కనే ఆర్థో వార్డుకు వచ్చే రోగులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్వీ వైద్య కళాశాలలో కూడా విద్యుత్తు సరఫరా లేక విద్యార్థులు, సిబ్బంది చీకట్లో ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేసవి నుంచి ఉపశమనం పొందేలా..



వేసవితాపం నుంచి శ్రీవారి గజరాజులు(ఏనుగులు) ఉపశమనం పొందుతున్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు, ఊరేగింపుల్లో నిత్యం రెండు గజరాజులు పాల్గొంటూ ఉంటాయి. 20 రోజులుగా తిరుమలలో ఎండతీవ్రత పెరగడంతో భక్తులతో పాటు గజరాజులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఈ క్రమంలో ఏనుగుల కోసం మావటిలు ఉదయం నుంచి సాయంత్రం వరకు గోశాలలో నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. కాస్త ఉక్కగా అనిపిస్తే నీటిలో దిగి గజరాజులు జలకాలాడుతున్నాయి. - తిరుమల, ఆంధ్రజ్యోతి

మహిళా శక్తితోనే మార్పు

● ఎన్డీఏ కూటమి మహిళల ఆత్మీయ సమావేశంలో ఆరణి శ్రీనివాసులు
● జనసేనలోకి పెద్దఎత్తున చేరికలు



ఎన్డీఏ కూటమి మహిళల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు మార్పునకు ఓటు వేయాలని, పవన్ కల్యాణ్ ఆశయాలను బలపరిచేందుకు తనను గెలిపించాలని ఎన్డీఏ కూటమి తరపున బరిలో ఉన్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోరారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీ మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మహిళలు శుభానికి చిహ్నమని, పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటయించడంతో సైకిల్ స్థానంలో గాజు గ్లాస్ గుర్తుకు ఓటువేయాలని ఆయన కోరారు. తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ సతీమణి లక్ష్మి, ఆరణి సతీమణి సత్యవతితోపాటు మూడు పార్టీలకు చెందిన మహిళా నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి స్థానిక నాయకులు చిన్ని, బాలాజీ, శివ ఆధ్వర్యంలో 49, 50 వార్డులోని దాదాపు వంద మంది యువకులు ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ సమక్షంలో చేరారు. భూమన కుటుంబం చేతిలో తిరుపతి, జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యాయని విమర్శించారు. ధనం, దౌర్జన్యం, దొంగ ఓట్లను వైసీపీ ఆయుధాలుగా మార్చుకుందన్నారు. దీనికి ముందు ఉదయం రామచంద్ర పుష్కరిణి, టీటీడీ పరిపాలన భవనం వద్ద వాకర్స్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు.



వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు

వారికో న్యాయం.. మాకో న్యాయమా?

● ఎన్నికల ప్రచారానికి వైసీపీకి అనుమతిస్తే మాకూ ఇవ్వండి
● ఎస్వీయూ వీసీకి జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వినతి



పోలీసులతో ఆరణి వాగ్వాదం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో తమకో న్యాయం, వైసీపీ వారికి ఒక న్యాయమా? అని కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రశ్నించారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో వైసీపీ ఎన్నికల ప్రచారం సాగుతుందనే సమాచారంతో జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి బుధవారం అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు వారిని అడ్డుకున్నారు. యూనివర్సిటీలో ప్రచారానికి అనుమతి ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది. వైసీపీ వారు ఎలాంటి అనుమతితో ప్రచారం నిర్వహిస్తున్నారనే విషయం చూడటానికే వచ్చామని, ప్రచారం చేపట్టడానికి రాలేదని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులను అనుమతిస్తే, తమను కూడా అనుమతించాలని వీసీ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆరణి శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్‌ను ఇంజినీరింగ్ కాలేజీ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వీసీకి వినతిపత్రం అందజేసి వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హోంగార్డుకు ఆర్థిక చేయూత



తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 10 : ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు రాజారెడ్డికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆర్థిక సాయం అందజేశారు. రాజారెడ్డి అందించిన సేవలకు కృతజ్ఞతా భావంగా హోంగార్డులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు బుధవారం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అదనపు ఎస్పీ వెంకట్రావు, బాస్కరరెడ్డి పాల్గొన్నారు.

2 నుంచి ఎస్వీయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎస్వీ యూనివర్సిటీలో మే 2వ తేదీ నుంచి ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను పరీక్షల విభాగం విడుదల చేసింది. 2వ తేదీన రీసెర్చ్ మెథడాలజీ, 4న రీసెర్చ్ టాపిక్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని సీఈ దామ్లానాయక్ వెల్లడించారు.


అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఈ తరానికి స్ఫూర్తిదాయకమని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వర్సిటీ సెనేట్ హాల్లో బుధవారం నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి సభలో ఆయన మాట్లాడుతూ బడుగు జీవుల కోసం జీవితాంతం అంబేడ్కర్ శ్రమించారని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులు చదవాలని, తద్వారా స్ఫూర్తిపొంది సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ సంఘ సంస్కర్తగా, న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, కుల నిర్మూలన కోసం పాటుపడిన వ్యక్తిగా బహుముఖ కృషి చేశారని తెలిపారు. కుల సమస్య పరిష్కారానికి జీవిత కాలం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుందరరాజు, రెడ్డిమోహన్, గిరిరాజు, దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈవోకు శుభాకాంక్షల వెల్లువ



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 10: టీటీడీ కొత్త జేఈవో ఎం.గౌతమికి బుధవారం పలు వురు శుభా కాంక్షలు తెలిపారు. పరిపాలన భవనంలోని ఛాంబర్‌లో టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్లకిరణ్ ఆధ్వర్యంలో పలువురు ఆమెను కలిసి సత్కరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



గోవిందరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎస్వీయూ తెలుగు పరిశోధకుడు శీలంకి గోవిందరావు డాక్టరేట్ పొందారు. శ్రీకాకుళం జిల్లా కవిత్వం - పరిశీలన అంశంపై ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ నుంచి సుందరరాజు తొలగింపు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలపతి వెల్లడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఏఐఎస్ఎఫ్ ఎస్వీ యూనివర్సిటీ కార్యదర్శి సుందరరాజును ఆ పదవి తొలగిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చలపతి ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్ నియమావళికి వ్యతిరేకంగా సుందరరాజు వ్యవహరిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటూ ఏఐఎస్ఎఫ్‌కు నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నామని అన్నారు. ఈ విషయాన్ని విద్యా సంస్థలు, అధికారులు, విద్యార్థులు గమనించాలని ఒక ప్రకటనలో కోరారు.

సీజ్ చేసిన రూ.26.07లక్షల నగదు అప్పగింత

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10: జిల్లాలో 17 కేసుల్లో 35,06,559 నగదు సీజ్ చేయగా వాటిలో 13 కేసుల్లో ఆధారాలు సమర్పించడంతో రూ.26,07,550 లక్షలను గ్రీవెన్స్ త్రిసభ్య కమిటీ ద్వారా సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలాగే సి-విజిల్ యాప్ ద్వారా మొత్తం 538 ఫిర్యాదులు అందగా 410 పరిష్కరించినట్లు వెల్లడించారు.

నాతో సహా ఏడుగురు ఎమ్మెల్యేల గెలుపు ఖాయం

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 10: జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలతో కలిసి తానూ విజయం సాధిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజాభిమానాన్ని కూడగట్టి కేంద్రంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తిరుపతి పరిసర ప్రాంతాల అభివృద్ధికి రహదారులు, విద్యాసంస్థలను కేటాయించిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. తిరుపతి రాజధాని అనేది తన వ్యక్తిగత నిర్ణయంగా తీసుకున్నానన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. విపరీత బుద్ధులతో బీజేపీ వినాశ కాలం దగ్గరపడిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు యార్లపల్లి గోపి, శాంతియాదవ్, తేజవతి, జావేద్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం మాటున దోపిడీ: పాశిం



యల్లసిరి సర్పంచు కవితకు టీడీపీ కండువా కప్పుతున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఏప్రిల్ 10: ఐదేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ సంక్షేమం మాటున దోపిడీకి తెరతీశారని గూడూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ ఆరోపించారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని యల్లసిరి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని వ్యవస్థలను నిర్వీర్యం చేయడమేకాక, అన్ని వర్గాలకు అన్యాయం చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చుతున్నామని చెప్పి పన్నులు, చార్జీలు పెంచి ప్రజలను దోచుకున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలతో అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా యల్లసిరి పంచాయతీ సర్పంచు ఏనుగుల కవిత, మాజీ సర్పంచు పోలిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజగోపాలరెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దనరెడ్డి, సునీల్‌రెడ్డి, చెంచురామయ్య ఆచారి, భారతమ్మ, చిన్నారావు, గిరినాయుడు, రాజేష్‌రెడ్డి, రషీద్, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని అంతమొందించాలి

గూడూరు, ఏప్రిల్ 10: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోన్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చవటపాళెం ప్రాంతంలో టీడీపీలోకి చేరిన పలువురికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి, అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కల్లబొల్లి మాటలు చెబుతూ కుటిల ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4 వేలకు ఇంటి వద్దకే అందజేసేలా చంద్రబాబు బాధ్యత తీసుకుంటారన్నారు. అలాగే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు జీతం పెంచుతారని తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాల కల్పన, సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడును సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కనుమూరు హరిచంద్రారెడ్డి, నాగరాజు, పులిమి శ్రీనివాసులు, చాన్‌బాషా, వాటంబేడు శివకుమార్ పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం



బీసీ సదస్సులో మాట్లాడుతున్న రామచంద్రయ్య నాయుడు

డక్కిలి, ఏప్రిల్ 10: టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామయంద్రయ్య నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని డి.వడ్డిపల్లి గ్రామంలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీలో బీసీ కులాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె, టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకటగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. చంద్రబాబు నాయుడు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని నిర్వీర్యం చేసేందిని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను అణగదొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కరరెడ్డి, చితంమాను పెంచలయ్య, వెంకటపతి, దేవళ్ల శంకరయ్య, చెంచురామయ్య, కోటయ్య, పోట్టా మునెయ్య, చినపాపయ్య, పీపీ చౌదరి, అంకయ్య, పోకూరు రమేష్ నాయుడు, బాలకృష్ణా రెడ్డి, పాయశం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు వేగవంతం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: పదో తరగతి విద్యార్థి అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. విన్నమాల దళితవాడకు చెందిన వెంకటయ్య, సుభాషిణి దంపతుల కుమారుడు భావేష్(14) మృతదేహం ఈనెల 6వ తేదీన డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో రాళ్లగుట్ట నడుమ లభ్యమైన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు విభిన్న కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. భావేష్ నత తల్లిదండ్రుల ఫోన్లను ఉపయోగించి ఉండటం వల్ల వాటి డేటాను పోలీసులు సేకరించి నిశిత పరిశీలన చేస్తున్నారు. భావేష్ మృతదేహం లభ్యమైన ప్రదేశంలో ఎలాంటి రక్తపు మరకలు లేకపోగా, మృతుడి తల, ముఖంపై రక్తపు ధారలు ఉండటంతో ఎక్కడైనా హత్య చేసి తీసుకొచ్చి పడేసుంటారని పోలీసులు భావిస్తున్నారు. కాగా, పట్టణంలోని పార్కు వద్ద స్నేహితులతో చిన్నపాటి వివాదం చోటుచేసుకున్న విషయం పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి



బాలాయపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 10: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, ఎపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌ను గెలిపించాలని క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యం నాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి కోరారు. బుధవారం బాలాయపల్లి, సంగవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. వైసీపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరు ప్రసాద్ నాయుడు, ప్రసన్న కుమార్, కాగితాల తేజ, దట్టం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

కోట, ఏప్రిల్ 10: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎస్‌ఐ నాగబాబు కోరారు. మండల పరిధిలోని వంజివాక దళితవాడలో బుధవారం రాత్రి ఎన్నికల నిర్వహణపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి కార్యకలాపాలకు ఉండకూడదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

తడ, ఏప్రిల్ 10: లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. మండల పరిధిలోని పూడి గ్రామానికి చెందిన వరదపరెడ్డి సెల్వరాజ్(60) బుధవారం సొంత పనిమీద తడలోని జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ఇతనిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సెల్వరాజ్‌ను స్థానికులు శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: చికిత్స పొందుతూ పురుషోత్తం(68) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మార్చి 19వ తేదీన బైపాస్‌రోడ్డులోని ఆవాని అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు పక్కన పురుషోత్తం నడచి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

వాకాడు, ఏప్రిల్ 10: వాకాడు బజారువీధిలో మంగళవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ చేశారు. బజారువీధిలో ఉన్న మెడికల్ షాపు, పక్కనే ఉన్న ప్రొవిజన్ షాపు షట్టర్లను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మెడికల్ షాపులో సుమారు రూ.10వేలకు పైగా నగదు ఎత్తుకెళ్లారు. ప్రొవిజన్ షాపులో షట్టర్లు పగలగొట్టినప్పటికీ అవి తెరచుకోకపోవడంతో దొంగలు వెనుదిరిగారు.

వలంటీర్ల రాజీనామా

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 10: మున్సిపాలిటీ పరిధిలో 72 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు కమిషనర్ రషీద్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని పాపమాంబపురం పంచాయతీ పరిధిలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో నీలకంఠారెడ్డి బుధవారం తెలిపారు.





మంగళంపాడు చెరువులో అసంపూర్తి పనులు - వృథాగా ఉన్న నీటి పైపులు

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు ● నీటి వనరులున్నా సూళ్లూరుపేటవాసులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10: నియోజకవర్గ కేంద్రమైన సూళ్లూరుపేట పట్టణంలో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. ఇప్పటికే ప్రజలు చేతిలో బిందె పట్టుకుని ట్యాంకర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 25 వార్డులు, 58 వేల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం పట్టణానికి పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ నుంచి నీటిని అందిస్తున్నారు. అదేవిధంగా తల్లంపాడు చెరువు నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా కొన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అడుగంటి నీటి ఎద్దడి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో గత టీడీపీలో హయాంలో శాశ్వత నీటి పరిష్కారం కోసం ఏఐఐబీ ఆర్థిక సాయంతో రూ.162 కోట్లతో మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టి, అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా తాగు నీరందించేలా ప్రణాళిక రూపొందించారు. రెండేళ్ల క్రితం మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ ట్యాంకుకు తెలుగు గంగ నీటిని రప్పించి అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణ దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టారు. కొంతదూరం పైపు లైన్ల పనులు కూడా జరిగాయి. ఇంతలో ఎన్నికలు జరిగి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో రూ.162 కోట్ల ఏఐఐబీ నీటి పథకం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అక్కడక్కడ నిర్మించిన ట్యాంకులు, సంపులు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. నీటి వనరులు పుష్కలంగా ఉన్న సూళ్లూరుపేటలో కూడా నీటి ఎద్దడి ఉందంటే పాలకుల నిర్లక్ష్యమేనని చెప్పాలి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ముందుముందు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.



ట్యాంకర్ల వద్ద నీళ్లు పట్టుకుంటున్న జనం

జగన్‌ను ఇంటికి పంపడమే కూటమి లక్ష్యం: కురుగొండ్ల



టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 10: రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న జగన్‌ను ఇంటికి సాగనంపడమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లుతో కలిసి మీడియాతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీరం రాజేశ్వరావు, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, గల్లా శ్రీనివాసులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో తన కుమార్తె, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జి జింకా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దొంతు మునివెంకటరత్నం, కుమార్, బి.మునిరాజా, ఎం.నవీన్, పి గోపాల్ ఆచారి, కే.వెంకటేష్, షేక్ జుబేదా, మీనీ, సుజాత, పావని, లడ్డు, సునీత, సుబ్బమ్మ, చెంగమ్మ, బుజ్జమ్మ, జయమ్మ, రాజమ్మ, మునిసా, బత్తినయ్య, నారాయణ, పోలయ్య, చెంగల్‌రాయుడు, సుబ్రహ్మణ్యం, గడ్డం రమేష్, సుబ్బయ్య, ఆనంద్, వంశీలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

పెళ్లకూరు, ఏప్రిల్ 10: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని మాజీమంత్రి పరసా రత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పునబాక పంచాయతీ పరిధిలోని చవటకండ్రిగ, పునబాక, పునబాక కండ్రిగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా రత్నం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలలో మహిళకు పెద్దపీట వేసి మరోసారి మహిళా పక్షపాతిగా రుజువు చేసుకున్నారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లకు నెలకు రూ.10వేలు ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు హరినాయుడు, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు పునబాక పోలయ్య, నాయకులు తాళ్ల యుగంధర్, యాగాని బెన్నీ ఆధ్వర్యంలో సాగిన ప్రచారంలో ప్రజలు పాల్గొని టీడీపీకి మద్దతు పలికారు. ప్రచారానికి వెళ్లిన టీడీపీ నాయకులను ప్రజలు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యాక్రమంలో సూళ్లూరుపేట జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, కందమూడి శివకుమార్, గూడూరు ప్రభావతమ్మ, పేరం మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, పక్కన టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం

పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదాం: వరప్రసాద్

వరదయ్యపాళెం/తడ/వెంకటగిరి, ఏప్రిల్ 10: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదామని ఆ పార్టీల తిరుపతి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి, గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో బుధవారం జరిగిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలోని పెత్తందారుల అడుగులకు తాము మడుగులు ఒత్తలేదన్న కారణంగా కక్ష కట్టి పార్టీ నుంచీ తనను, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని బయటికి పంపించేశారని ఆరోపించారు. దేశం, మన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుండాలన్నారు. అందుకే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ టీడీపీ- జనసేన -బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన చారిత్రక అవసరముందన్నారు. సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్, పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, అధికార ప్రతినిధి నాగరాజు, హరిచౌదరి, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జయచంద్రనాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు పురుషోత్తం, ఎస్సీసెల్ అధ్యక్షులు మునికృష్ణయ్య, సిద్ధులయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాకు వాసు, రాఘవయ్య, దొరబాబు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో సభలో వరప్రసాద్, లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరిలో ఆత్మీయ సమావేశం

వెంకటగిరిలో నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్ పాల్గొన్నారు. కేంద్రంలో మోదీ ప్రధాని కావడం కోసం తిరుపతి నుంచీ బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని, దానికోసం శ్రేణులు కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రోగులకు అన్నదానం చేస్తున్న భానుప్రకాష్ తదితరులు

వైద్య శిబిరంలో వైసీపీ రాజకీయం!

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 10: ఉచిత వైద్య శిబిరాన్నీ వైసీపీ రాజకీయం చేసింది. తమను కాదని.. టీడీపీ నేతలు రావడంపై ఆగ్రహించింది. దీంతో కొంతమందికి మాత్రమే వైద్యం చేసిన వైద్యులు, సిబ్బంది.. తర్వాత వెళ్లిపోయారు. నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతలపట్టెడలో బుధవారం ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని స్థానికంగా పర్యవేక్షించిన టీడీపీ నేతలు.. గాలి భానుప్రకాష్‌ను ఆహ్వానించారు. ఈ వైద్యశిబిరంపై ప్రచారం చేయడంతో.. పరిసరాల నుంచి చాలా మంది అక్కడికి చేరుకున్నారు. వైద్య పరీక్షలు ప్రారంభించారు. కాగా, గాలి భానుప్రకాష్ వస్తున్నారనే విషయం తెలిసి.. స్థానికుడైన వైసీపీ నేత, మున్సిపల్ చైర్మన్ మంత్రి రోజాకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై ఆమె ఫోనుచేసి ప్రైవేటు ఆస్పత్రి వారిపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ప్రచారం జరిగింది. వైద్యులు, సిబ్బంది అర్థంతరంగా వైద్య శిబిరాన్ని ఆపేసి వెళ్లిపోవడం.. ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. వైద్య శిబిరానికి జనాన్ని పిలిపించి.. కొందరికి మాత్రమే వైద్య పరీక్షలు చేసి వెళ్లిపోవడం.. దీనికి మంత్రి రోజా కారణమని తెలిసి స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, అనంతరం చింతలపట్టెకు చేరుకున్న నగరి టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్.. అక్కడ రోగుల కోసం టీడీపీ నేత బాబు ఏర్పాటు చేసిన భోజనాన్ని వడ్డించి వెళ్లారు. టీడీపీ నాయకులు మీరా, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీని గెలిపించండి



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 10: నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య కోరారు. బుధవారం మండలంలోని కల్లూరులో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, సుబ్రహ్మణ్యంరెడ్డి, హేమావతి, మోహన్, అంజయ్య, రవిరెడ్డి, మంజు, పెద్దబ్బరాజు, మునిశేఖర్, సుబ్రహ్మణ్యం యాదవ్, శేషాద్రి యాదవ్, భాస్కర్ రెడ్డి, బత్తినాయుడు, వెంకటేశ్వరరావ్, గిరీష్ రాజు, శివ, వినోద్, చైతన్య, చందు, వెంకటేష్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

వడమాలపేట, ఏప్రిల్ 10: మండలంలోని పాపరాజుకండ్రిగకు చెందిన వైసీపీ నాయకుడు రాధాకృష్ణమరాజు టీడీపీలో చేరారు. ఆయనకు గాలి భానుప్రకాష్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.

ఐదేళ్లలో జరిగింది దోపిడీనే : భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 10: వైసీపీ ఐదేళ్లలో పాలనలో నగరి నియోజకవర్గంలో జరిగింది దోపిడీ మాత్రమేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని గేటు పుత్తూరు 10వ వార్డు అధ్యక్షుడు డీజీ ధనపాల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గాన్ని లూటీ చేశారని ఆరోపించారు. గుట్టలు, చెరువులు, గుంటలు, కాలువలతో సహా దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ దోచుకున్న ప్రతి పైసా కక్కిస్తామని స్పష్టం చేశారు. పుత్తూరు అభివృద్ధి చెందాలంటే అరాచక వైసీపీని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో నవరత్నాల కన్నా అధిక లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఇప్పటి కన్నా రెట్టింపు సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, ప్రతి ఒక్క కుటుంబం ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయి, మునేంద్ర, కృష్ణ చైతన్య, తిరిష్, నవీన్, గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎన్ ధనపాల్, షణ్ముగరెడ్డి, డీఎస్ గణేష్, కరుణాకర్, యుగంధర్, అశోక్, ఆనంద్, జనసేన నాయకులు మహేష్, జగదీశ్వర్‌రాజు, నాగ పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న భానుప్రకాష్



టీడీపీలో చేరిన వారితో ఆదిమూలం

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 10: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం తెలిపారు. బుధవారం ఉదయం మండల పరిధిలోని హరి ఫంక్షన్ హాల్‌లో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. సింగిల్ విండో చైర్మన్ ఊరప్ప, దిగువ కనకాపలెం పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నేత బాబు, తిరువట్యం ఉప సర్పంచు రజినితో పాటు కీలగరం, ఎరికంబట్టు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, గాండ్ల గోవిందశెట్టి, శంకయ్య, రజిని, మధు, ముత్తు తదితరలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు


పార్టీలో చేరిన వారితో సుధీర్ రెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 10: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయ బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఓబులాయపల్లి గ్రామంలోని వైసీపీనాయకులు పాపిరెడ్డి, వెంకటరమణా రెడ్డి, వెంకటమునినాయుడు, ఎస్టీకాలనీకి చెందిన వైసీపీ నాయకులు వెర్రి గెరటయ్య, బలరామ్, లక్ష్మయ్య, చిన్నయ్య ఊరందూరులోని సుధీర్‌రెడ్డి నివాసంలో బుధవారం సుధీర్‌రెడ్డిని కలిసి టీడీపీ లో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ నాగంపల్లికి చెందిన మప్పేటి మహానందరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో బుధవారం సుమారు 55మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మహానందరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, లక్ష్మణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, భక్తవత్సలరెడ్డి, ప్రతాప్, రామ్‌మోహన్, మునివర్మరెడ్డి ఉన్నారు టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గుణయాదవ్, రామచంద్రారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్, గురవయ్య, మునెయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా పార్టీలో చేరిన వారు సుధీర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి తెలిపారు.

రేణిగుంట: పట్టణానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం ఊరందూరులో టీడీపీ నాయకులు జ్యోతినారాయణ, ఎంజీ రాజేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశారు. వీరికి సుధీర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారు టైలర్ నరసింహులు, వైసీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వాలంటీరు నరసింహులురెడ్డి, చిన్న, కిషోర్, ముకేష్, తేజ, సురేష్, కుమార్, మురళీకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమర్‌నాథ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 10: మండలంలోని శ్రీకాళహస్తి పిచ్చాటూరు ప్రధారహదారి కొత్తకండ్రిగ క్రాస్ వద్ద తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర వాహల తనిఖీలు బుధవారం సాయంత్రం నిర్వహిస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న కెవిబిపురం మండలం లక్ష్మీపురంకి చెందిన వెంకటయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద 7మద్యం బాటిళ్ల స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైసీపీ ప్రచారంలో పోస్టల్ ఉద్యోగి


ఎమ్మెల్యే కుమార్తెతో కలిసి ప్రచారంలో పాల్గొన్న బీపీఎం

తొట్టంబేడు, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెంలో బీపీయంగా పనిచేస్తున్న నాగూర్‌రెడ్డి వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. అతను ఎమ్మెల్యే కుమార్తె నిర్వహిస్తున్న ప్రచారంలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పాల్గొన్న పోస్టల్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గంగమ్మ ఆలయానికి విరాళం

ఏర్పేడు, ఏప్రిల్ 10: మండలంలోని మాధవమాల గ్రామంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భార్య శ్రీవాణిరెడ్డి బుధవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అలీఖాన్

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 10: ఎన్నికల విధుల్లో ఎవరైనా అలస్వతం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహ్మద్ అలీఖాన్ సిబ్బందికి హెచ్చరించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకు వచ్చిందని మీ పరిధి గ్రామాల్లో వారి నుంచి పోస్టల్ బ్యాలెట్‌లు చేర్చాలన్నారు. అలాగే ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారికి ఆర్డర్ కాపీలను వారికి చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ చందంబ్రాబునాయుడు, సీనియర్ సహాయకులు నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ కళాశాలలో తిరుపతి లలితమ్మ డయాగ్నోస్టిక్ సెంటరు, టాటా కెన్సర్ అనుపత్రి వైద్యులు బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరానికి 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా ఉచితంగా కెన్సర్ నిర్ధాణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్‌నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి

ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ దివాకర్ తెలిపారు. మండలంలోని ఆలత్తూరు గ్రామంలో ప్రాథమికి ఆరోగ్య కేంద్రం వారు వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 5గంటల తరువాత బయటకు రావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుకు గురైన బోర్లు.. ప్రజలకు అవస్థలు


కోటమంగాపురంలో మరమ్మతులకు గురైన చేతిబోరు

కేవీబీపురం, ఏప్రిల్ 10: మండలంలో చేతిబోర్లు మరమ్మతులకు గురై నెలల గడుస్తున్నా పట్టించుకునే వారు లేరు. దీంతో గ్రామాల్లో తాగు నీటి సమస్య ఏర్పడింది. మండువేసవిలో తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్ద చేతిబోరు మరమ్మతులకు గురై మూడు నెలలు దాటింది. బోర్ మెకానిక్‌కు చెప్పినా పట్టించుకోలేదు. అసలు బోరుమెకానిక్ ఉన్నట్లా.. లేనట్లా అని ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే గ్రామాల్లో బోర్లు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటమంగాపురంలో చేతి బోరు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా బాగు చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్లను బాగు చేయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: ఆర్వో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో నరసింహులు

సత్యవేడు, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుపై నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సహాయక ఎన్నికల అధికారి, తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్, రికార్డులు నిర్వహణ తదితర అంశాలపై బీఎల్వోలు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నరసింహులు మాట్లాడుతూ వచ్చే 48 గంటల్లోగా వారి వారి పరిధిలో బ్యానర్స్ పోస్టర్స్, దిమ్మెలకు పార్టీ రంగులు ఉన్నట్లయితే వాటిని వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు సమాచారం అందితే వెంటనే ఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు బీఎల్వోలు, పంచాయతీ సెక్రటరీలు బాధ్యతగా పని చేయాలన్నారు. సత్యవేడు సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌కేంద్రంలో ర్యాంపు తదితర సౌకర్యాలున్నాయో లేదో బీల్వోలు వారి పరిధిలో పరిశీలించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, సహాయక ఎన్నికల వ్యయ పరిశీలకులు విశ్వనాథ రాయల్, కుమారస్వామి, సత్యవేడు పంచాయతీరాజ్ విస్తరణాధికారి ముని రవికుమార్, ఎలెక్షన్ సీనియర్ అసిస్టెంట్ సురేష్, వీఆర్వో ఇళయరాజు, పలువురు పంచాయతీ సెక్రటరీలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పన్నుల రాయితీని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో పన్నుల రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. కొత్త ఆర్థిక సంవత్సరం పనుల చెల్లింపుపై బుధవారం కమిషనర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 30వ తేదీలోగా ఆస్తి, కుళాయి, ఖాళీ జాగా పన్నులు చెల్లించే వారికి 5 శాతం రాయితీ వస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పన్నుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని, నగదు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల సమాచారం అప్‌డేట్‌గా ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉంచుకోవాలని డీఆర్వో పెంచల కిషోర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల విధుల్లో ఉన్న నోడల్ అధికారులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. నివేదికలను అందుబాటులో ఉంచుకోవాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 55,756 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

సుధీర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి



తొట్టంబేడు, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని బొజ్జలసుధీర్‌రెడ్డి నివాసంలో పార్లమెంట్ పరిశీలకులు యంఎల్‌సీ ధీపక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిదానాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇంకొద్దిగా కష్టపడి అత్యధిక మెజారిటీ సాధించాలని సుధీర్‌రెడ్డికి సూచించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, తాటిపర్తిరవీంద్రనాథ్‌రెడ్డి, పాపిరెడ్డి, దశరదాచ్చారి, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ కొత్త కమిటీ నియామకం


మజ్దూర్ యూనియన్ చైర్మన్, సెక్రటరీ సదాశివరెడ్డి, బాబు

రేణిగుంట, ఏప్రిల్ 10: సీఆర్‌ఎస్‌లో మజ్దూర్ యూనియన్ కొత్త కమిటీ నియామకం జరిగింది. బుధవారం క్యారేజీ షాప్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ జనరల్ సెక్రటరీ శంకరరావు ఆదేశాలతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సదాశివరెడ్డి, సెక్రటరీగా బాబు, కోశాధికారిగా మునికుమార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు మునిరాధా, హ్యాండరీపాల్, చంద్రశేఖర్, చంద్రనాయక్, తిలక్‌కుమార్‌రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

10మంది వలంటీర్ల రాజీనామా

రేణిగుంట, ఏప్రిల్ 10: మండల పరిధిలో పదిమంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. గుత్తివారిపల్లెకు చెందని 9మంది, గాజులమండ్యంకు చెందిన ఒక వాలంటీరు రాజీనామా చేశారని ఎంపీడీవో విష్ణుచిరంజీవి తెలిపారు.

వార్ వన్ సైడ్ ...


ప్రచారం చేస్తున్న సుధీర్ రెడ్డి, బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తిలో టీడీపీ విజయం వార్ వన్ సైడ్ అని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 28వ వార్డు పరిధిలో బుధవారం టీడీపీ, బీజేపీ నేతలు సంయుక్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ అంతం కోసం ప్రజలు పంతం పట్టారని, వైసీపీని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నామని జనం చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జి కంఠా రమేష్, బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ, రమేష్ బాబు, రమణారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్ నగర్ చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ చేరిన వారు మాట్లాడుతూ...టీడీపీతోనే శ్రీకాళహస్తి అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తి, నాగమ్మ, సునీత, సుబ్రహ్మణ్యం, గిరి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించి రంజాన్ పర్వదినం జరుపుకోబోతున్న మైనారిటీ సోదరులకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి బుధవారం ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని మైనారిటీ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే టీడీపీ లక్ష్యం


మహిళలతో కలిసి కోలాటమాడుతున్న రిషితారెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 10: మహిళల ఆర్థికాభివృద్ధే టీడీపీ లక్ష్యమని శ్రీకాళహస్తి టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. మండలంలోని దిగువకొణతనేరి గ్రామంలో బుధవారం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళినాయుడు, మునిరాజనాయుడు, సర్పంచ్ గాలి బాలాజీనాయుడు, లెక్కల మురళినాయుడు, రమాదేవి, పోలమ్మ, మల్లీశ్వరి, బత్తెమ్మ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమంత, గజ వాహనాలపై ఆది పురుషుడు


గజ, హనుమంతవాహనాల్లో విహరిస్తున్న కోదండరాముడు



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 10: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారు హనుమంతవాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. ఉదయం 10 నుంచి 11.30 వరకు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7నుంచి 8.30 వరకు కోదండ రాముడు గజ వాహనంపై మాడవీధులలో విహరించారు. తిరుమల పెద్ద జియ్యర్, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో, రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి.

అలరించిన భువన విజయం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 10: శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శించిన భువన విజయం ప్రేక్షకులను అలరించింది. వసంతరుతువు ప్రవేశం సందర్భంగా ప్రదర్శించిన ఈ భువన విజయంలో శ్రీకృష్ణదేవరాయలు - ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, మహామంత్రి తిమ్మరుసు- ఆచార్య కె.సర్వోత్తమరావు, అల్లసాని పెద్దన - మేడసాని మోహన్, ధూర్జటి - ఆముదాల మురళి, తెనాలి రామకృష్ణుడు - ఆకెళ్ల విభీషణ శర్మ, నంది తిమ్మన - మద్దూరి ఆదిత్య శర్మ, రామరాజభూషణుడు - పరమేశ్వరయ్య, పింగళి సూరణ - గంగిశెట్టి లక్ష్మీనారాయణ, అయ్యలరాజు రామభద్రుడు - వై.వెంకటేశ్వర్లు, మాదయగారి మల్లన - నాదెళ్ల శ్రీమన్నారాయణ తమ పాత్రలను రసవత్తరంగా పోషించారు. చక్కటి పద్యాలాపనతో అకట్టుకున్నారు. అనంతరం కళాకారులను సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల, పూర్వ ప్రిన్సిపాల్ తిరుపతి సుధాకర్ సత్కరించారు. కార్యక్రమంలో తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, జయరామ్ ప్రసాద్, బీవీ రమణ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగానికి గుర్తింపుకార్డు తప్పనిసరి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఓటర్‌కార్డు(ఎపిక్‌కార్డు) లేనివారు ప్రత్యామ్నాయంగా ఆధార్, జాబ్, పాన్‌కార్డులు, బ్యాంకు, పోస్టాఫీస్ జారీ చేసే ఫొటోతో కూడిన పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్ ఇలా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

2 నుంచి ఎస్వీయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎస్వీ యూనివర్సిటీలో మే 2వ తేదీ నుంచి ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను పరీక్షల విభాగం విడుదల చేసింది. 2వ తేదీన రీసెర్చ్ మెథడాలజీ, 4న రీసెర్చ్ టాపిక్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని సీఈ దామ్లానాయక్ వెల్లడించారు.

ఎస్వీ వైద్య కళాశాల మార్చురీకి విద్యుత్తు అంతరాయం

● గంటల తరబడి సరఫరా లేకపోవడంతో దుర్వాసన


దుర్వాసన భరించలేక మార్చురీ ముందు ముక్కు మూసుకుని కూర్చొన్న మహిళ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 10 : ఎస్వీ వైద్య కళాశాల, దాని అనుబంధ మార్చురీకి బుధవారం నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. తద్వారా మృతదేహాల నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గుర్తు తెలియని మృతదేహాలను ఎస్వీ వైద్య కళాశాల మార్చురీలోని ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. మంగళవారం సెలవు కావడంతో ఆ రోజు మృతిచెందిన వారి దేహాలను కూడా పోస్టుమార్టం చేసేందుకు మార్చురీలో భద్రపరిచారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. 11 గంటల వరకు రాలేదు. ఆ సమయంలో మార్చురీలో తొమ్మిది మృతదేహాలు ఉన్నాయి. వీటిల్లో నాలుగు గుర్తు తెలియని మృతదేహాలు కావడంతో పది రోజులకు భద్రపరిచి ఉన్నారు. నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మృతదేహాలు డీకంపోజ్ అయ్యి దుర్వాసన వెదజల్లాయి. దీంతో ఈ మార్గాన వెళ్లే వారు, పక్కనే ఆర్థో వార్డుకు వచ్చే రోగులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్వీ వైద్య కళాశాలలో కూడా విద్యుత్తు సరఫరా లేక విద్యార్థులు, సిబ్బంది చీకట్లో ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.